శర్మబావ ఇళ్ళవేట

కొరిడె శ్రీనివాస

'ఆయనెవరో చెప్పినట్లు ఇసుకనుంచి నూనె తియ్యటంకన్నా, ఎండమావిలో నీళ్ల తాగటం కన్నా, బజార్లో పంచదార దొరకటంకన్నా కూడా కష్టం భాగ్యనగరంలో ఇల్లు సంపాదించటం. ఇక్కడ వచ్చిన చిక్కేమిటంటే హైదరాబాద్ ట్రాన్స్ఫరయి వచ్చిన ప్రతి వెధవా చిక్కడపల్లిలో ఉందామనే అనుకుంటాడు దాంతో అక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం ఇళ్లకి విపరీతమయిన డిమాండు వాళ్ళ మాత్రం ఛస్తారా దూరంగా వెళ్లి ఉందామంటే మన సిటీబస్సుల పుణ్యమా అని లేటుగా వచ్చినందుకు రోజూ ఆఫీసర్ చేత చీవాట్లు తినాలి దానికితోడు ఆటోలవాళ్ళ పీక్కుతినేస్తారు. అసలు ఈ విషయంమీద ఒక పేపర్ రాసేద్దామను కుంటున్నాను' గిరీశం పోజు పెట్టాడు శర్మబావ.

'బావా! ప్రసిద్ధిచెందిన ఉస్మానియా యూనివర్సిటీలో సోషియాలజీ లాంటి డిపార్టుమెంటులో లెక్చరర్వి అయినందుకే నిన్ను అభినందించాలి ఇటువంటి విషయాలమీద పేపర్లు రాస్తే నీకు సన్మానం చేసే ప్రమాదం రావచ్చు జాగ్రత్త'

'పిచ్చివాడా! పనికిమాలిన పొలిటీషియన్లకి సన్మానాలు చెయ్యటంలో మునిగి ఉన్నారు జనం అంతా మనకి అలాంటి భయాలేమీ లేవు'

'అవన్నీ సరేగాని బావా నా యింటి విషయం ఏం చేశావు'

'అభయం. అభయం. అయినా నిన్ననే కదరా వచ్చావు. తొందరపడకు. కాఫీ ఇస్తావా కాంతామణి' ఒక పొలికేక పెట్టాడు.

"చూడు రాంబాబూ! జీవితం చాలా చిన్నది. ఈ కాస్త జీవితం నవ్వుతూ గడిపెయ్యాలి చిన్న చిన్న సమస్యలు వచ్చినప్పుడు షేక్స్పియర్లాగా మొహం పెడితే పెద్ద సమస్యలు వచ్చినపుడు జుట్టు పీక్కున్నా తెగవు. అంచేత తొందరపడి బాధపడకు నీకు ఇల్లు చూసే బాధ్యత నాది.'

శర్మబావ నాకు మేనత్త కొడుకు. చిన్నప్పట్నుంచి కలిసి మెలిసి తిరిగినవాళ్లం అవటంచేత చనువు ఎక్కువ. వయసులో నా కన్నా ఓ పదేళ్ళ పెద్దవాడే. మొన్నటివరకు మద్రాసులో ఉన్న నాకు హైదరాబాదు ట్రాన్స్ఫరవటంతో రైలుదిగి తిన్నగా శర్మబావ ఇంటికిచేరి, ఇల్లు వెదికే భారం తనమీద పెట్టాను

కాఫీ వచ్చింది. సిప్ చేశాం.

'కాఫీ తిన్నావోయ్' అన్నాడు భార్యతో. అది శర్మబావకి ఊతపదం

'గ్రామర్ తప్పు బావా! కాఫీ తినరు. తాగుతారు.'

'అబ్బ! జోక్ తిన్నావోయ్.'

* * *

ఆ రోజు ఆదివారం. పొద్దున్న తొమ్మిదిన్నర అవుతోంది రేడియోలో నిలయ విద్వాంసులు వేణువుని, వంటింట్లో శర్మబావ పెసరట్లని ఊదేస్తున్నారు.

నేను మూడు పెసరట్లు తిని చేతులెత్తేశాను.

'పట్టుమని పది పెసరట్లు తినలేని వాడివి నువ్వేం తెలుగువాడివిరా. అరవ దోసెలు తినటానికి అలవాటు పడిపోయావు. నాకు ఇంకో పెసరట్టు వెయ్యవోయ్ ప్రాణసఖీ' అన్నాడు భార్యవైపు తిరిగి.

ఒక పెసరట్టు పడింది ప్లేటులో

'అయినా నేరం నాదికాదు లలితకుమారీ నీ చేతి వంటది. ఇవాళ పెసరట్లు నిజంగా తిన్నావు" అన్నాడు భార్యతో.

"నేనింకా తినలేదు ఇందాకట్నుంచీ తింటోంది మీరే"

"అబ్బ. జోకు తిన్నావోయ్ "

శర్మబావ ఉంటే సందడికి తక్కువేమీ ఉండదు.

'బావా. మనం కనీసం ఇవ్వాళైనా ఇళ్లవేట పూర్తి చెయ్యాలి' అన్నాను. అప్పటికే దరిదాపు వారంరోజులు అవుతోంది నేను వచ్చి. శర్మబావ ఎంత కావలసినవాడైనా అన్నిరోజులు ఇంకొకళ్ల ఇంట్లోఉండటంనాకిష్టంలేదు అందులోనూసిటీల్లో.

'వెళ్దాం రా. నేతితో వండిన ఈ పెసరట్లు హెవీడోస్ ఇలా పడితే ఇక సాయంత్రంవరకు మనం తిండి మొహం చూడక్కర్లేదు. ఇవ్వాళ అంతా నీ పనే' అన్నాడు చెయ్యి కడగటానికి లేస్తూ

* * *

సిటీబస్‌లో పక్కన కూర్చున్నాయనతో బావ బాతాఖానీ.

'ఈ పేపర్లో ఇందిరాగాంధీ ఫోటో చూశారా మాస్టారూ. ముక్కు తింటుందండీ'

'చూడండి. ఆవిడకి గవర్నమెంటువాళ్ళు జీతం ఇస్తారు. అదిగాక తండ్రి రాసిన పుస్తకాలమీద ఆదాయంకూడా ఆవిడకి బాగానే ముడుతుంది. అందుచేత ఆవిడకి ఇలా ముక్కులు, బుక్కులు తినాల్సిన అవసరం లేదు' అన్నాడాయన చరణ్‌సింగ్ మొహంపెట్టి సీరియస్‌గా.

'అబ్బ జోకు తిన్నారు సార్. సీరియస్‌గా జోకు చెప్పగలిగినవాళ్ళని ఇన్నాళ్లకి మిమ్మల్ని చూశాను '

* * *

నారాయణ్ గూడాలో బస్ దిగాం.

'ఇక్కడ దగ్గర్లో ఒక ఇల్లు ఉండాలి చూద్దాం' అన్నాడు శర్మబావ.

అయిదు నిముషాలు నడిచాక తాజ్‌మహల్ హోటల్ దగ్గర సందులో ఒక ఇంటి ముందు ఆగాం.

ఇంటి నెంబరు చూశాక, 'కామేశ్వరరావుగారూ' అంటూ పిలిచాడు గుమ్మం దగ్గర నిలబడి

కొద్దిసేపట్లో ఒక మధ్యవయస్కుడు బయటికి వచ్చాడు

'ఎవరండీ'

'కామేశ్వరరావుగారు మీరేనా' అడిగాడు బావ

'అవును'

'నమస్కారం సార్. నా పేరు శర్మ వీడి పేరు రాంబాబు '

'నమస్కారం. ఏం కావాలండీ' ఆయన్ని చూస్తే కొత్తవాళ్లతో మాట్లాడటం ఇష్టంలేని వాడిలాగా అనిపిస్తున్నాడు

'వీడు నా మేనమామ కొడుకండీ. బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు ట్రాన్స్‌ఫర్ మీద ఇక్కడికి వచ్చాడు మీ ఇంట్లో ఒక పోర్షను అద్దెకి ఉందని తెలిసివచ్చాం' క్లుప్తంగా వివరించాడు

'మా ఇంట్లో పోర్షను ఏమీ అద్దెకి లేదు' ఆయన మొహం ఎందుకనో చాలా అప్రసన్నంగా ఉంది.

శర్మబావ అర్థం కానివాడులాగా అటూ ఇటూ చూశాడు గేటు దగ్గరికి వెళ్లి ఇంటి నెంబరుని తన డైరీలో రాసుకున్న నెంబరుతో పోల్చి చూశాడు

'ఇంటి నంబరు ఇదే మీ పేరు బి. కామేశ్వరరావు కదా' ఆయన్ని అడిగాడు

'అవును' ఆయనకి ఈ వ్యవహారం అంతగా నచ్చినట్లులేదు

'అయితే మీ ఇంట్లో పోర్షను ఉండేతీరాలి' తేలిగ్గా ఊపిరి పీలుస్తూ అన్నాడు శర్మబావ.

'లేదని నేను చెపుతున్నాను కదా' ఆయన చికాగ్గా అన్నాడు

'మీరు భలేవారు సార్' అన్నాడు శర్మబావ కొట్టిపారేస్తున్నట్లుగా

'మా ఇంటి పేరు భలే కాదు. భావరాజు' ఆయన సీరియస్‌గా అన్నాడు.

మా శర్మబావకి సమానంగా జోకు వెయ్య కలిగిన వాడిని ఇన్నాళ్లకి చూశాను.

'అబ్బ ... అబ్బ ... జోకు తిన్నారు సార్.

శర్మ బావ — ఇళ్ల వేట

ఇంతకీ మీరు భావరాజువారా. ముందే చెప్పారు కారు. అయితే మీకు కాకినాడలో భావరాజు సుబ్బారావుగారు తెలిసే ఉంటారు' అన్నాడు శర్మబావ ఆయన ఆయువుపట్టు తెలుసుకున్న ధోరణిలో.

'ఆ కాకినాడ సుబ్బారావు ఎవరో నాకు తెలియదు' ఏమిటీ గోల. అన్నట్లు చూశాడు.

'కాకినాడ సుబ్బారావు కాదు. భావరాజు సుబ్బారావ్. కాకినాడలో ... ' టీచరు బుద్ధిపోనిచ్చు కోకుండా సరిదిద్దాడు శర్మబావ.

'ఎవరైతేనేం, ఆయన నాకు తెలియదు. తెలిసినా మీకు పోర్షను ఇచ్చేది లేదు' అసహనంగా అన్నాడు ఆయన.

'అంటే ఉందన్నమాట. నేను చెప్పలే' దొంగని పట్టేశాడు బావ

పేకాట్లో పొరపాటున జోకరు కిందపడేసిన వాడిలాగా మొహం పెట్టాడు కామేశ్వరరావుగారు.

'మీరు మొహమాట పడకండి సార్' అంటూ శర్మబావ అటూ ఇటూ వెదుకుతున్నట్లుగా చూశాడు. 'మేం కూర్చోవచ్చా' అడిగాడు

'నిరభ్యంతరంగా కూర్చోవచ్చు. కాని పోర్షను లేదు' అన్నాడు ఆయన నిలదొక్కుకోవటానికి ప్రయత్నిస్తూ.

'పోర్షనుదేముంది సార్. ఇవ్వాళ ఉండకపోతే రేపు ఉంటుంది. కాని మనుషులు, పరిచయాలు ఎంత విలువైనవి అవి ఇలా తేలిగ్గా వదిలెయ్య కూడదు మీరు అలాగే నిలబడిపోయారు కూర్చోండి సార్'

ఆయన కూర్చున్నాడు శర్మబావవంక తీక్షణంగా చూస్తూ.

'మంచినీళ్లు తాగుతారా' చాలా మర్యాదగా అడిగాడు బావ, ఆయన తన అతిథి అయినట్లు

ఆయన తల అడ్డంగా ఊపాడు ఇంకా తీక్షణంగా చూస్తూ.

జోలపాట

॥పల్లవి॥ జో ! ఓటరానంద ! జో ! జో ! ఓటరూ
'ఓటు' పరమానంద 'నోటు' బాగుందా !
'నోటు'లేకుంటే మరి 'సీటు' గోవిందా ! !

॥చ॥ తాతలంతా మరి నేతులే తాగారు
నేతలంతా నీకు నీతులే చెప్పారు
చివరికంతా కలిసి గోతులే తవ్వారు
గోతిలో జనమంత కలిసి నవ్వారు

॥చ॥ రేపన్నదే లేదు నీకూ నాకూ
నిన్న మొన్నలు మనకి అన్నలే కాదా
బొంకి చెపితే నీకు తీయగుంటదీ
నిజం చెపితే నీకు చేదుగుంటదీ

జో ! ఓటరానంద ! జో ! జో ! ఓటరూ!
'ఓటు' పరమానంద 'నోటు' బాగుందా !

— రామసూరి

'నేను తాగుతాను'

ఆయనకి ఏం చెయ్యాలో తెలియలేదు. జుట్టు పీక్కున్నంత పనిచేసి, సీరియస్‌గా చూస్తూ లోపలికి వెళ్లాడు.

ఈ వ్యవహారం ఎక్కడికి వెళ్తోందో నాకు అర్థం అవటంలేదు.

'నువ్వు కూర్చోరా మన ఇల్లే అనుకో'

'నాకేం అర్థం కావటంలేదు బావా'

'అవసరంలేదు నీకు ఇక్కడ పోర్షను ఇప్పించే బాధ్యత నాది' అన్నాడు భుజం తడుతూ.

నాకుమాత్రం అంతా అయోమయంగా ఉంది.

ఇంతలో ఆయన రెండు గ్లాసుల్లో మంచినీళ్లు తీసుకువచ్చాడు ఒకగ్లాసు శర్మబావ తీసుకున్నాడు.

'నాకు వద్దండీ' అన్నాను రెండోది ఆయన నాకివ్వబోతుంటే

ఆయన వెనక్కి తీసుకోబోయాడు.

'అదికూడా నాకే ఇచ్చెయ్యండి. పాపం వెనక్కి ఏం తీసుకువెళ్తారు' అన్నాడు శర్మబావ ఆ గ్లాసు కూడా తీసుకుంటూ.

రెండు గుక్కల్లో రెండు గ్లాసులూ ఖాళీ చేశాడు.

'ఇంతకీ నేను చెప్పేది ఏమిటంటే మా ఇంటి పేరు తుర్లపాటివారు' అన్నాడు శర్మబావ ఖాళీ గ్లాసులు కిందపెడుతూ.

'కావచ్చు. కాని పోర్షనులేదు' నిర్లిప్తంగా అన్నాడు ఆయన.

'భావరాజువారికి, తుర్లపాటివారికి తరతరాలుగా సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. వాటిని మనం ఇలా తుంచెయ్యకూడదు సార్ !'

'ఎందుకు తుంచెయ్యకూడదు. ని . . ని .. అదేమిటబ్బా' బుర్ర గోక్కున్నాడు.

'నికృష్టం' శర్మబావ అందించాడు.

'కాదు.'

'నిర్యాణం '

'ఛ '

'నిక్షేపం.'

'కరెక్ట్ నిక్షేపంగా తుంచెయ్యవచ్చు!' అని ఆయన తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు

'ఆ పని మీ భావరాజువారు చెయ్యగలరేమోగాని మా తుర్లపాటివాళ్లం చెయ్యలేం' అన్నాడు శర్మబావ కొంచెం బిగ్గరగా.

ఆయన బదులు చెప్పేలోగా లోపల్నుంచి కర్టెన్ తొలగించుకుని ఒక ముసలావిడ వచ్చింది.

ఆవిడ్ని చూడగానే శర్మబావ మొహం ఆనందంతో వెలిగింది. కామేశ్వరరావుగారు మాత్రం కంగారు పడ్డారు.

'ఎవరు బాబూ తుర్లపాటివారి అబ్బాయి' కళ్లజోడు సవరించుకుంటూ అడిగింది ఆవిడ.

'అమ్మా ! నువ్వు లోపలికి వెళ్లు' ఆయన ఆవిడని లోపలికి తీసుకెళ్లబోయాడు.

శర్మబావ చెంగున ఆవిడ ముందుకి వెళ్లి 'నమస్కారం మామ్మగారూ ! నేనే తుర్లపాటివారి అబ్బాయిని. నా పేరు శర్మ. ఇల్లు అద్దెకి అడగటం కోసం వచ్చాను' అంటూ పరిచయం టూకీగా పూర్తిచేశాడు.

'నువ్వా బాబూ. మా పుట్టింటివారి ఇంటి

పేరు కూడా తుర్లపాటివారే' అంది ఆవిడ ఆనంద పడిపోతూ నెత్తిమీద ముసుగు సర్దుకుంటూ.

'ఆహాఁ ఎంతటి అదృష్టం మామ్మగారూ. మన ఇద్దరి ఇంటి పేర్లు ఒకటే అవటం నా పూర్వ జన్మ సుకృతం. ముందు మీరు కూర్చోండి మామ్మగారూ. పెద్దవారు, ఎక్కువసేపు నిలబడ లేరు' హడావిడి చేశాడు శర్మబావ పరిస్థితిని తన చేతుల్లోకి తెచ్చుకుంటూ.

కామేశ్వరరావుగారు నిస్సహాయుడిలా చూస్తూ ఉండిపోయాడు.

'నిజమే నాయనా. రెండు నిముషాలు నిలబడితే చాలు నడుంనొప్పి ఏమిటో? పోయే వయసేగాని వచ్చే వయసా.' ఒకసారి నిట్టూర్చి వెంటనే అడిగింది 'ఇంతకీ మీది ఏ వూరు బాబూ' కుర్చీలో కూర్చుంటూ.

'అమ్మా! నువ్వు లోపలికి పద.'

'ఉండరా. మీది ఏ వూరు బాబూ.'

'మాది బందరండి.'

'నా మాట వినమ్మా. లోపలికి రా'

'అలాగా. అయితే తుర్లపాటి హనుమంతరావు తెలిసే ఉండాలే.'

శర్మబావ ఎగిరి గంతేశాడు.

'తెలియటం ఏమిటండీ. ఆయన మా నాన్నగారే'

కామేశ్వరరావుగారు తల పట్టుకుని కూర్చుండి పోయాడు.

'చెప్పావు కాదేం నాయనా. నువ్వు మా హనుమంతు కొడుకువా. నిన్నెప్పుడో ఇంతప్పుడు చూశాను. అప్పుడు నీకు నాలుగేళ్లు. బందర్లో గొడుగుపేటలో ఉండేవాళ్లు మీరు. ఆ రోజుల్లో నువ్వు-ఎప్పుడూ బట్టలు వేసుకోకుండా...'

'మామ్మగారూ'

'...చీమిడి ముక్కుతో...'

'మామ్మగారూ'

'...ఎప్పుడూ ఏడుస్తూ '

'మన బంధుత్వం ఏమిటో చెప్పారుగారు మామ్మగారూ!' తెలియని వయసులో తాను చేసినవి ఇప్పుడు చర్చించటం ఇబ్బందికరంగా ఉంది శర్మ బావకి.

'అయ్యో. బంధుత్వాలు అడిగి తెలుసుకోవలసిన అగత్యం పట్టింది. చూడు నాయనా. మీ నాన్న చిన్నప్పుడు తన ఇంట్లోకన్నా ఎక్కువ మా ఇంట్లోనే ఉండేవాడు. అన్నం, చదువు, బట్టలు అన్నీ మాతో పాటే. తర్వాత దూరాభారంవల్ల ఒకళ్లకొకళ్లు దూరం అయ్యాంగాని, ఒకళ్లంటే ఒకళ్లకి ఎంత ఆప్యాయత...అభిమానం...' ఆవిడ గతంలోకి వెళ్లి పోతోంది.

కామేశ్వరరావుగారు ఊపిరి బిగపట్టి వింటు న్నాడు డీలాపడ్డ మొహంతో.

'అంటే చాలా దగ్గర సంబంధం అన్నమాట' అన్నాడు శర్మబావ ఆయనవైపుచూసి తలఆడిస్తూ.

'అలాగని మరీ అంత దగ్గర సంబంధమూ కాదనుకో' అంది ఆవిడ.

శర్మబావ మొహంలో, వెలుగు కాస్త తగ్గింది.

'అలాగని పూర్తిగా బీరకాయ పీచుకూడా కాదు గదా మామ్మగారూ' అన్నాడు బావ.

'ఎంత మాట నాయనా! స్వయానా నా వేలు విడిచిన బాబాయి మనవడే మీ నాన్న' అంది ఆవిడ సస్పెన్స్ చేప్పేస్తున్నట్లుగా పోజుపెట్టి.

కొంచెం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు కామేశ్వరరావుగారు.

అది గమనించిన శర్మబావ 'అది చాలదుటండీ. కావాలనుకుంటే; అంతకన్నా దగ్గిర సంబంధం ఏముంటుంది చెప్పండి? ఇన్నాళ్లూ అజ్ఞానంలో ఉండి మిమ్మల్ని కలవలేదు' అన్నాడు బుద్ధుడిలాగా.

'దానిదేముందిలే నాయనా! ఇప్పుడు తెలిసిందిగా.'

'పోయేటప్పుడు మా నాన్నయినా చెప్పలేదు మరి' టైముకి అస్త్రం వదిలాడు శర్మబావ.

'ఆఁ! హనుమంతు పోయాడా! ఎప్పుడు జరిగింది ఈ ఘోరం' ఆవిడ ఆత్రంగా అడిగింది.

పరిస్థితి మళ్లీ శర్మబావ చేతుల్లోకి వచ్చింది.

'పోయిన సంవత్సరం చనిపోయారండి మా నాన్నగారు. గుండెజబ్బుచేసి' అన్నాడు విచారంగా మొహంపెట్టి.

'అయ్యో! వెళ్లిపోయావా హనుమంతూ. అందరి ఆయువూ పోసుకుని నేనే బతుకుతున్నాను పాపిష్టిదాన్ని' అంది ఆవిడ ముక్కు చీదుతూ.

అవునన్నట్లుగా చూశాడు కామేశ్వరరావుగారు.

'అలా అనకండి మామ్మగారూ. అందరం పోయేవాళ్లమే. ఒకళ్లు ముందు. ఒకళ్లు వెనుక. అంతే' అన్నాడు శర్మబావ ధైర్యం చెపుతున్నట్లుగా.

ఒక నిముషం భారంగా గడిచింది. ఆవిడ ముక్కు చీదటం బాక్‌గ్రౌండ్‌లో కంటిన్యూ అవుతూండగా?

'ఇవ్వాళ చాలా సుదినం మామ్మగారూ. ఇల్లు వెదుక్కుంటూ వస్తే మీరు కనిపించారు. వీడు మా మామయ్య కొడుకు. పేరు రాంబాబు. బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయి వచ్చాడు. మీ ఇంట్లో పోర్షను ఒకటి అద్దెకి ఉందని తెలిసి ఇలా వచ్చాం' అన్నాడు అసలు విషయానికి వస్తూ.

'ఉంది బాబూ. రెండు రోజుల క్రితమే ఖాళీ అయింది. ఏరా కాముడూ. ఉంది కదా!' ఆవిడ కొడుకుని అడిగింది.

'నిన్ననే ఇంకొకళ్లకి ఇస్తానని చెప్పాను అమ్మా...' అన్నాడాయన నీరసంగా.

'ఎవరికో ఎందుకు? కావలసినవాళ్లు ఉన్నప్పుడు బయటివాళ్లకి ఇవ్వటం ఎందుకు. వాళ్లకి లేదని చెప్పెయ్' అంది ఆవిడ అధికార స్వరంతో.

'అదికాదమ్మా. .'ఆయన ఏదో చెప్పబోయారు.

'ఇంకేం చెప్పకు.'

'అదికాదమ్మా వీళ్లు ఎలాంటి టైపు మనుషులో తెలుసుకోకుండా...' మూలుగుతున్నాడు ఆయన.

శర్మబావ ఎగిరి గంతేశాడు.

'ఆఁ కరెక్ట్ టైప్... టైపిస్ట్' అన్నాడు ఆవేశంగా.

కామేశ్వరరావుగారు కంగారు పడ్డట్టుగా అటూ ఇటూ చూశాడు.

'ఏమిటబ్బాయ్. టైపు ఏమిటి?' ఆవిడ కుతూహలంగా అడిగింది.

'ఏం లేదు మామ్మగారూ. అది వేరే కథ.'

'ఏం లేదులే అమ్మా. నువ్వింక లోపలికి వెళ్లు' కంగారుగా అన్నాడాయన.

'వెళ్తాలేరా ఇతనికి మాత్రం ఇల్లు ఇయ్యి. అద్దె గురించి ఏమీ పోట్లాడకు' అందావిడ లేస్తూ.

శర్మబావ కూడా లేచాడు.

'వస్తాను నాయనా. మంచిరోజు చూసుకుని వచ్చి దిగండి. ఒకళ్లకొకళ్లం తోడుగా ఉంటాం' ఆవిడ వీడ్కోలు సందేశం.

'అలాగే మామ్మగారూ! మీరు విశ్రాంతి తీసు





కోండి' అన్నాడు శర్మబావ ఆవిడతోపాటు లోపలి గుమ్మంవరకూ వెళుతూ.

ఆవిడ వెళ్లాక నావైపు తిరిగి కన్నుకొట్టి చిరు నవ్వు నవ్వాడు.

కాసేపట్లో కామేశ్వరరావుగారు బయటికి వచ్చాడు.

'అయితే మేం వస్తాం కామేశ్వరరావుగారూ. మంచిరోజు చూసి మా రాంబాబు ఫామిలీతోసహా వచ్చి దిగుతాడు. అద్దె ఎంతో మీరే చెప్పండి' అన్నాడు బావ చర్చలు ముగిసినట్లుగా.

'అది తర్వాత. ముందీ విషయం చెప్పండి. ఇందాక మీరు టైపు గురించి అన్నది ఏమిటి' అడిగాడు ఆయన కోపంగా.

'నేనేం అనలేదే. టైపిస్ట్ అని గుర్తు చేశాను అంతే'

ఆయన సూటిగా చూశాడు. ఓడిపోతున్నట్టుగా ఉంది ఆ చూపు.

'మీకు ఎంత తెలుసు'

'నాకు అంతా తెలుసు. టైపిస్ట్...మాలతి... ప్రేమ. .వ్యవహారం...'

సినిమాల్లో విలన్లాగా అనిపించాడు శర్మబావ నాకు.

ఆయన్నిచూస్తే జాలేసింది.

చివరి ప్రయత్నంగా అన్నాడు – 'తెలిసినంత మాత్రాన మీరు ఏం చెయ్యగలరు' మేకపోతు గాంభీర్యం నటించాడు

'ఈ విషయం మీ అమ్మగారి చెవిలో ఊది ఊది ఊదరగొట్టేశాను అనుకోండి, ఆవిడ మీ భరతం పట్టేస్తారు. అవునా'

ఆయన ఒక్కనిముషం ఆలోచించాడు.

'సరే. మంచిరోజు వచ్చి దిగండి. అద్దె మూడొందలు. ఇల్లు చూసి వెళ్లండి' అన్నాడాయన పక్కపోర్షను తాళం తీస్తూ.

*   *   *

'ఏమిటి బావా ఈ మిస్టరీ ? ఈ సస్పెన్స్ నేను భరించలేను. నువ్వు టైపిస్ట్ గురించి ఆయనతో అన్నది ఏమిటి ? అది విని ఆయన ఎందుకు అంత భయపడ్డాడు. ఆ ముసలావిడని చూసి ఆయన ఎందుకంత భయపడుతున్నాడు ? ఈ ప్రశ్నలకి సమాధానం తెలిసీ చెప్పకపోయావో నా తల వెయ్యి ముక్కలయిపోతుంది' ప్రశ్నల వర్షం కురిపించాను బయటికి రాగానే.

శ్రీ కృష్ణపరమాత్మ వేషంలో ఎన్టీఆర్‌లాగా చిర్నవ్వు నవ్వాడు శర్మబావ.

'పిచ్చివాడా. అదే కిటుకు నీకు కథంతా చెప్తాను విను. ఈ పోర్షన్లో రెండురోజుల క్రితం వరకూ నా స్నేహితుడు ఒకతను ఉండేవాడు. అతన్ని బలవంతంగా ఖాళీ చేయించాడు ఈ కామేశ్వరరావు గారు తన తల్లికి తెలియకుండా. ఎందుకో తెలుసా ? ఆయన ఆఫీసులో మాలతి అని ఒక టైపిస్ట్ ఉంది ఆ వృద్ధకన్యతో ప్రేమలో పడ్డాడు ఈయన. ప్రక్క పోర్షన్లో ఆవిడ్ని తెచ్చి, అద్దెకు దింపినట్లుగా దింపి, వ్యవహారం సాగించ వచ్చని ఆయన ప్లాన్. ఈ విషయం నా స్నేహితుడు నిన్న నాకు చెప్పాడు. అతన్ని ఈ కుటుంబం గురించి వివరాలు అడిగితే తెలిసింది. కామేశ్వరరావుకి ఒక ముసలి తల్లి ఉందని, ఆవిడ పుట్టింటివారి ఇంటి పేరు తుర్లపాటి అని ఆవిడ అప్పుడప్పుడు మా ఫ్రెండ్‌తో చెపుతూ ఉండేదిట.'

'ఆవిడంటే కామేశ్వరరావుగారికి ఎందుకంత భయం ?'

'వస్తున్నా. అదే అసలు పాయింటు. అయిదు లక్షల రూపాయల ఆస్తి అంతా ఆవిడ పేర్న ఉంది. ఆవిడకి ఏ మాత్రం కోపం వచ్చినా యావదాస్తిని అనాథశరణాలయానికి రాసేస్తానని బెదిరిస్తూ ఉంటుందిట. అందుకని ఆవిడంటే కామేశ్వరరావుకి చచ్చేంత భయం. వాడి భక్తి అంతా ఆస్తిమీదనేనని తెలిసిన ఆ ముసలావిడ అది వాడి పేర రాయటం ఆలస్యం చేస్తోంది. ఈ విషయాలు అన్నీ మా స్నేహితుడి దగ్గర్నుంచి తెలుసుకుని ఈ ప్లాన్ వేశాను. తిన్నాను కదా ?'

'బావా... నువ్వు జీనియస్.'

'నీ మొహం. ఈ మాత్రం తెలివితేటలు లేకపోతే ఈ లోకంలో మనలాంటి చిన్నచేపలు బతకటం కష్టం. అయితే ఇందులో మనం ఊహించని విషయం ఆ ముసలావిడకి మా నాన్నగారు తెలియటం. దానివల్ల పని తేలిక అయింది' అన్నాడు శర్మబావ తాజ్‌మహల్‌లోకి దారితీస్తూ. ★

ఆంధ్రపత్రిక

కలకత్తాలో తెలుగువారికి...

ఇప్పుడు కలకత్తాలో ఆంధ్ర సచిత్ర వారపత్రికతోపాటు
ఆంధ్రపత్రిక దినపత్రిక కూడా లభిస్తోంది.
దినపత్రిక కావలసినవారు మా వారపత్రిక అమ్మేచోట అడగండి.
లేదా మా ఏజెంటును సంప్రదించండి.

: మా ఏజెంటు చిరునామా :

శ్రీ ఏ. రామస్వామి,
8–B, ప్రతాపాదిత్యరోడ్ : : కలకత్తా - 700026.
ఫోన్ : 41-1469